ప్రజాశక్తి
గురువారం 27 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో
మన్యం జిల్లాకు మూడో స్థానం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఇంటర్ ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 53 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలిచింది. బుధవారం విడుదలైన ఫలితాలలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 1,679 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 884 మంది పాసయ్యారు. అదే విజయనగరం జిల్లాలో 5,673 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,502 మంది ఉత్తీర్ణత సాధించారు. 44 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

- పెరుగుతున్న మలేరియా కేసులు
- నిలిచిన హెచ్‌డిఎస్ నిధులు
- పిహెచ్‌సిల్లో మందులకు వైద్యులదే చేతిచమురు
- నాలుగేళ్లు కావస్తున్నా పంపిణీ కాని దోమతెరలు

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

మలేరియాకు మందుల్లేవ్

ప్రభుత్వాలు మారినా పరిపాలన ఒక్కటే. వైద్యం అన్నదే అత్యవసరం. దానికి తగ్గట్టుగా ఎవరు పరిపాలించిన వైద్యానికి లోటు చేయకూడదు. కానీ, జిల్లా వ్యాప్తంగా మలేరియా మందుల కొరత వేధిస్తోంది. గతేడాది ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డిఎస్) నిధులు ఆలస్యంగా పంపిణీ చేశారు. ఈ ఏడాది ఆ నిధులు కూడా రాలేదు. దీంతో మలేరియా మందుల కొరత ఏర్పడింది. బయట మార్కెట్లో కూడా ఎసిటి, ప్రేమాక్వీన్ మందులు దొరకడం లేదు. ఒకవేళ ప్రముఖ నగరాల నుంచి మందులు తెప్పిస్తే, వైద్యులకు చేతి చమురు వదులుతోంది. ఇప్పటికే ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైంది. ఏజెన్సీలో మలేరియా జ్వరాలు మరోవైపు కుదిపేస్తున్నాయి. దీంతో వైద్యులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-సీతంపేట

పార్వతీపురం మన్యం జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 యుపిహెచ్‌సిలు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది ఇప్పటివరకు 340 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. సీతంపేట మండలంలో జనవరి నుంచి ఇప్పటివరకు 49 మలేరియా పాజిటివ్ కేసులు తేలాయి. అంటే, మన్యంలో మలేరియా విజృంభణ ఎలా ఉందో అర్థమౌతోంది. నాలుగేళ్లకు ఒకసారి దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా ఇంకా దోమతెరలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుకోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు ర్యాపిడ్ కిట్ ద్వారా పరీక్షించి మలేరియా పాజిటివ్ నమోదైతే, మరల స్లైడ్ ద్వారా పరీక్షిస్తారు. అప్పుడూ మలేరియా పాజిటివ్‌గా తేలితే ఆ నివేదిక కూడా జిల్లా కేంద్రానికి పంపించాలి. అప్పుడు జిల్లా కేంద్రం నుంచి మలేరియా మందులు రోగికి సరఫరా చేస్తున్నారు. లేదంటే వైద్యులు సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేసి రోగులకు ఇస్తున్నారు. అధికారులు మాత్రం అవసరమైతే ఆస్పత్రి అభివృద్ధి నిధులు వినియోగించాలని చెబుతున్నారు. కానీ ఆస్పత్రి అభివృద్ధి నిధులు ఈ ఏడాది పిహెచ్‌సిలకు రాలేదు. దీంతో వైద్యులు ఏమీ చేయలేక సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు.

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే మలేరియా మందుల నిల్వలు ఉండేవి ప్రస్తుతం స్లైడ్ ద్వారా మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయితే జిల్లా మలేరియా కేంద్రం నుంచి మందులు వస్తాయి. ర్యాపిడ్ ద్వారా మలేరియా నిర్ధారణ అయితే మాత్రం వైద్యులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిందే. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందుల కొరత వేధిస్తోంది. గతంలో ర్యాపిడ్ కిట్ ద్వారా మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయినా మలేరియా మందులు రోగికి అందజేసేవారు. ప్రేమాక్వీన్, ఆర్టిసునేట్ (ఎసిటి).. ఈ రెండు రకాల మలేరియా మందులు లేవు . కేవలం క్లోరోక్లీన్ మందులు మాత్రమే ఉన్నాయి.

మండలాల వారీగా మలేరియా కేసులు

మండలం	మలేరియా కేసులు
భామిని	12
గుమ్మలక్ష్మీపురం	78
జియ్యమ్మవలస	10
కొమరాడ	36
కురుపాం	53
మక్కువ	5
పాచిపెంట	36
పార్వతీపురం	24
సాలూరు	25
సీతంపేట	49
వీరఘట్టం	12
మొత్తం	340

మందులు సర్దుబాటు చేస్తున్నాం

మలేరియా మందుల కొరత కొంత ఉంది. మలేరియా కేసులు లేని చోట అందుబాటులో ఉన్న మందులను సర్దుబాటు చేస్తున్నాం. ఇప్పటికే 3.80 లక్షల దోమతెరలు అవసరమని ప్రతిపాదనలు పంపించాం.

- టి.జగన్మోహనరావు, జిల్లా మలేరియా అధికారి

సీతంపేట ఏరియా ఆస్పత్రి

ఈ ఏడాది నిధులు రాలేదు

ఈ ఏడాది ఆస్పత్రి అభివృద్ధి నిధులు రాలేదు. మలేరియా మందుల కొరత ఉంది. అయితే ఆరోగ్యశ్రీ నిధులు ప్రస్తుతం ఉపయోగిస్తున్నాం.

- బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి సీతంపేట

హెచ్‌డిఎస్‌లో వాడొచ్చు

మందులు కొరత ఉంటే హెచ్‌డిఎస్‌లో వాడవచ్చు. ఈ నెలాఖరికి హెచ్‌డిఎస్ నిధులు వస్తాయి. ఇప్పటికే మలేరియా అధికంగా ఉన్నచోట మందులు సర్దుబాటు చేశాం. 401 హైరిస్క్ గ్రామాలకు గాను 16 గ్రామాల్లో మాత్రమే ఎసిఎం ద్రావణం స్ప్రేయింగ్ చేయలేదు. ఈ నెలాఖరుకల్లా ఆ గ్రామాల్లోనూ స్ప్రేయింగ్ పూర్తి చేస్తాం. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- కె.విజయ పార్వతి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి

యువతకు నైపుణ్య శిక్షణ

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు వారికి ఇష్టమైన రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో వైసిపి పాలనలో యువత నిర్వీర్యమైపోయిందని చెప్పారు. మద్యం షాపులు, చేపల దుకాణాలను యువకులతో పెట్టించిన గత ప్రభుత్వం వారి బంగారు భవిష్యత్తును పాడు చేసిందని ధ్వజమెత్తారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వాలంటీర్ ఉద్యోగాలు తప్ప ఏవీ భర్తీ చేయలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు నాయుడు యువతకు నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన దిశగా అడుగులు వేశారని చెప్పారు. త్వరలో వైటిసిలలో నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. లక్షలాది రైతులను ఆందోళనకు గురి చేసిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ని రద్దు చేసినట్లు తెలిపారు. దీని వల్ల రైతులు చాలా ఆనందంగా ఉన్నారని చెప్పారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.7 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. వికలాంగులకు రూ.6 వేలు, మంచాలకు పరిమితమైన రోగులకు రూ.15 వేలు చొప్పున పింఛను అందిస్తామన్నారు. స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి వివరించారు.

దుక్కులు దున్నుతున్న రైతు

తొలకరి పలకరింపు

సాగుకు సన్నద్ధమవుతున్న గిరిజన రైతులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. పొలాల్లో దుక్కులు ప్రారంభించారు. మరో రెండు మూడు వర్షాలు పడితే విత్తనాలు చల్లడానికి సిద్ధంగా ఉన్నారు. మండలంలోని 8800 ఎకరాల్లో 5400 మంది రైతులు ఖరీఫ్‌లో పంటలు చేస్తున్నారు. వరితో పాటు అరటి, పత్తి వంటి వాణిజ్య పంటలను కూడా సాగుచేస్తున్నారు. కొండపోడులో చిరు ధాన్యాలు పండిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల వద్దకు వస్తున్నారు. లక్కగూడ, రాయగడ జమ్ము, గొరడ వంటి ప్రాంతాల్లో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. ఏజెన్సీలో పుష్కలమైన సాగునీటి వనరులున్నా చెక్‌డ్యాములు, మినీ రిజర్వాయర్లు శిథిలం కావడంతో పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి. దీంతో ప్రతి ఏడాది వర్షాధారంపైనే రైతులు ఆధారపడి పంటలు పండిస్తున్నారు. దీంతో దమ్ములు ఆలస్యం కావడంతో సెప్టెంబర్ నెలాఖరు వరకు వరినాట్లు వేయడం కనిపిస్తుంది.

29న ఐటిడిఎలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 29న ఐటిడిఎలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎపిఒ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్, కెఎల్ గ్రూప్ సంస్థ సమన్వయంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఇంగ్లీష్‌లో మాట్లాడటం రావాలని, పదో తరగతి, డిగ్రీ అర్హత ఉండాలని చెప్పారు. రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు జీతభత్యాలు ఉంటాయని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వి.ప్రభాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి- కెమిస్ట్రీ, బోటనీ, బిఎ హిస్టరీ, బికాం కంప్యూటర్స్ తదితర కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 95533 27138 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వార్డుల్లో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్

పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం చెందారు. నగర పంచాయతీలో చిన్నకాపు వీధి, పెద్దకాపు వీధి ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మే నెలలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించినా ఇంతవరకు కాలువల్లోని పూడికలు తీయకపోవడంతో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు కూడా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన అధికారులపై మండిపడ్డారు. పారిశుధ్య నిర్వహణ పట్టించుకోకపోవడంపై కారణమేమిటని ఆయన నిలదీశారు.

రెండు రోజులకు ఒకసారి తాగునీటిపై పరీక్షలు జరపాలని సూచించారు. కాలువల్లో పైపు లైన్లు ఉన్న కారణంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడ నుంచి నీలమ్మకాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పిల్లలతో మాట్లాడారు. మీకు ఇస్తున్న ఆహారం బాగుందా? అని కలెక్టర్ అడుగగా, బాగుందని చిన్నారులు చెప్పడంతో ఆయన సంతృప్తి చెందారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ రమణ ఉన్నారు.

'చేయూత' డబ్బుల కోసం
కలెక్టరేట్ వద్ద మహిళల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మహిళలందరి బ్యాంకు ఖాతాల్లో జగనన్న చేయూత నాలుగో విడత డబ్బులు వెంటనే జమ చేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన మహిళలు ధర్నా చేశారు. తొలుత పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శోభితకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న చేయూత పథకం నాలుగో విడత నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.18,750 చొప్పున వేయడానికి ఎన్నికల ముందు అప్పటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారని గుర్తుచేశారు. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో ఎలక్షన్ కమిషన్, హైకోర్టు కలుగజేసుకొని.. ఎన్నికల తరువాత చేయూత మహిళలకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించాయని తెలిపారు. వెంటనే కొద్ది మందికి మాత్రమే జమ చేశారని, మిగిలిన వారికి నేటికీ జమ చేయలేదని తెలిపారు. నూతన ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని 45 ఏళ్లు దాటిన చేయూత లబ్ధిదారులకు వెంటనే బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా బాధిత మహిళలందరితో ఆందోళన ఉధృతం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, మహిళలు బి.అరుణ, ఎస్.శాంతమ్మ, బి.పద్మ, పి.సుజాత, రెడ్డి ధమయంతి, గొర్లి సత్యవతి, బి.కళావతి డి.చింతల్లి, వై.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చేయూత లబ్ధిదారులు

ఇవిఎంలపై అనుమానాలు

న్యాయ పోరాటం చేయాలి : మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ఎన్నికల్లో ఇవిఎంల వినియోగంపై న్యాయపోరాటం చేయాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అభిప్రాయ పడ్డారు. జాతీయ స్థాయిలో ఇవిఎంలపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు, సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకుని పోరాడాలని వైసిపి అధిష్టానాన్ని కోరారు. బుధవారం పట్టణంలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాక ఇవిఎంల పనితీరుపై అనేకమంది నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు కూడా తనకు ఫోన్ చేసి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎక్స్ సోషల్ మీడియా కంపెనీ యజమాని ఎలాన్ మస్క్ బలంగా అనుమానం వ్యక్తం చేశారని చెప్పారు. ఇవిఎంలను ఇప్పుడున్న టెక్నాలజీతో హ్యాకింగ్ చేయొచ్చునని ఎలాన్ మస్క్ గట్టిగా అభిప్రాయం వ్యక్తం చేశారని తెలిపారు. 2019 ఎన్నికల తరువాత మాజీ సిఎం చంద్రబాబు నాయుడు, టిడిపికి చెందిన ఐటి నిపుణులు కూడా ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేశారని గుర్తు చేశారు. దేశంలో 20 లక్షల ఇవిఎంలు కనిపించడం లేదని కొన్ని రాజకీయ పార్టీలు అనుమానం వ్యక్తం చేశాయని చెప్పారు. మాజీ ఎమ్‌పి ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా 20 లక్షల ఇవిఎంలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారని గుర్తుచేశారు. ఇవిఎంలపై రాజకీయ పార్టీల గుర్తుల్లో బిజెపి, టిడిపి గుర్తులు స్పష్టంగా కనిపించాయని, వైసిపి గుర్తు ఫ్యాన్ చాలా మసకగా కనిపించిందని చెప్పారు. దీనివల్ల చాలామంది అయోమయానికి గురై ఫ్యాన్‌కి బదులుగా నోటాకి ఓటు వేశారని చెప్పారు. ఫ్యాన్ గుర్తును పోలిన విధంగా నోటా ఉండడం, అది మసకగా కనిపించడంతో పార్టీకి నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇవిఎంల పనితీరుపై వ్యక్తమవుతున్న అనుమానాలను దృష్టిలో పెట్టుకొని తగిన ఆధారాలు సేకరించి న్యాయ పోరాటం చేయాలని వైసిపి అధిష్టానానికి సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలలో నెలకొన్న అనుమానాలు, భయాందోళనలు నివృత్తి చేసేలా, భరోసా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వైసిపి పాచిపెంట మండల సీనియర్ నాయకులు పి.చినబాబు, మాజీ కౌన్సిలర్ తాడ్డి శంకరరావు, వైసిపి నాయకులు మద్దిల గోవిందరావు పాల్గొన్నారు.

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిఒ 3కి చట్టబద్ధత కల్పించాలన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను స్థానికులతో మాత్రమే భర్తీ చేయాలనీ కోరారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ గురించి ఇటీవల మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర బృందం వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి వల్ల ఏజెన్సీలో ఉన్న నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. జిఒ 3ను రద్దు చేయడంతో గిరిజన ప్రాంతంలో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అరకు ఎన్నికల సభలో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారిని ఏకలవ్య పాఠశాలల్లో నియమించడాన్ని వ్యతిరేకించారు. ఈ విధానం వల్ల స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను స్థానిక నిరుద్యోగులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గెమ్మెల జానకిరావు, కమిటీ సభ్యులు చింత జోగయ్య, గెమ్మెల బాబాయి, మెల్లక అయోధ్య, కూనేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంలో భారీ వర్షం

పలు వీధులు జలమయం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలో బుధవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారితో పాటు పలు వీధులు జలమయమయ్యాయి. పట్టణంలో చిన్న వర్షం కురిసినా వరద నీరు ప్రధాన రహదారిపైనే ప్రవహిస్తుండటం వల్ల స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇటు పురపాలకులు గానీ, అధికారులు గానీ చర్యలు చేపట్టడం లేదు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలోని ఓ కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజాశక్తి
www.prajasakti.com

అనారోగ్యంతోనే ఏనుగు మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి మండలం తోటపల్లిలో మంగళవారం అనారోగ్యం కారణంగానే ఏనుగు మృతి చెందినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి జి.ఎ.పి.ప్రసూన స్పష్టంచేశారు. బుధవారం ఏనుగు మరణించిన క్షేత్రంలోనే ఆ భూ యజమాని అనుమతితో ఖననం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమరాడ, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో ఏడు ఏనుగులు సంచరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం ఏనుగుల కదలికను పర్యవేక్షిస్తున్న ట్రాకర్లు.. గుంపు నుంచి వెంకటలక్ష్మి అనే ఏనుగు అసాధారణ ప్రవర్తనను నివేదించారని తెలిపారు. ఏనుగు ఆహారం, నీరు తక్కువగా తీసుకుంటుందని, చురుకుగా లేదని సమాచారం ఇచ్చారని తెలిపారు. ఇదే విషయాన్ని ఎలిఫెంట్ మానిటరింగ్ యూనిట్ ఉన్నతాధికారులకు తెలియజేసిందన్నారు. అస్వస్థతకు గురైన ఏనుగుకు చికిత్స అందించేందుకు జూ వైద్యులు పార్వతీపురం చేరుకున్నారని, ఎన్‌క్లోజర్లో లేని అడవి ఏనుగుకు చికిత్స అందించడం ఇదే తొలిసారని చెప్పారు. అయినా, తోటపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఏనుగు మరణించిందని తెలిపారు. గాయం వల్ల ఇన్‌ఫెక్షన్ కావడంతో అది అభివృద్ధి చెందిన టాక్సేమియా కారణంగా మరణించిందని ప్రాథమిక పరిశీలనలో వెల్లడైందన్నారు. ప్రస్తుతం పార్వతీపురం పరిధిలో ఆరు, పాలకొండ పరిధిలో నాలుగు ఏనుగులు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ డిఎఫ్ సంజయ్ యెల్లా, పార్వతీపురం రేంజ్ అధికారి వివిఎస్ఎన్ రాజు, ఇఎంయు రేంజ్ అధికారి కె.మణికంఠేష్, గనగరాజపురం విఆర్ఒ టి.రవికుమార్ వెటర్నరీ డాక్టర్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -భామిని

విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న డిఇఒ

మండలంలోని పసుకుడి ప్రాథమిక పాఠశాల, భామిని ఆదర్శ పాఠశాల, కెజిబివి, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం డిఇఒ పగడాలమ్మ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేసిన కిట్లు, పాఠశాల రికార్డులు, బోధన సిబ్బంది హాజరును పరిశీలించారు. తరగతి గదిలో విద్యా బోధన ఎలా సాగుతుంది? అనే అంశాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, ఆహారంతోపాటు పాఠశాల పరిశుభ్రత పట్ల సిబ్బంది శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కరరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన వీరేష్

ప్రజాశక్తి - కురుపాం

మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరేష్

అమరావతిలో ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రైతులకు సాగునీరు అందించడానికి రిజర్వాయర్లు పూర్తి చేయడానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. దీనికి మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని వీరేష్ తెలిపారు.

450 ఎకరాల్లో వరి ఎద సాగు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో సుమారు 450 ఎకరాల్లో వరి ఎదలు వేసినట్లు ఎఒ అవినాష్ తెలిపారు. మండలంలోని జోగింపేట, ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో వరి ఎదలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతానికి 80 శాతం వరకు మొలకలు వచ్చాయని ఆయన తెలిపారు.

పిటిజి ప్రిన్సిపల్‌గా సురేష్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఎపి గిరిజన గురుకుల (పిటిజి) బాలికల పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా కె.సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా డి.భారతి పనిచేశారు. సురేష్ గతంలో ఇదే పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తూ భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు ఎఫ్ఎసి ప్రిన్సిపల్‌గా వెళ్లారు. అక్కడ రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించడంతో సురేష్ మళ్లీ ఇదే పాఠశాలకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సురేష్‌కు అభినందనలు తెలియజేశారు.

సోమగండిలో స్టాప్ ది డయేరియా

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సోమగండి గ్రామంలో స్టాప్ ది డయేరియా శిబిరాన్ని బుధవారం ఏర్పాటుచేశారు. అంగన్వాడీలో మండల ప్రత్యేకాధికారి సింహాచలం ఆధ్వర్యాన చేతులు శుభ్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలతో చేతులు శుభ్రం చేయించారు. నీరు కలుషితం కాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందరికీ అవగాహన కల్పించారు. డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా నివారణ చర్యలు అందరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఐసిడిఎస్ పిఒ రంగలక్ష్మి, అంగన్వాడీ టీచర్ పరిమళ, అంగన్వాడి సిబ్బంది కీర్తన, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ , తదితరులు పాల్గొన్నారు

సిహెచ్‌సికి హాట్ వాటర్ మిషన్ వితరణ

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి సూరు శ్రీధర్ తన తండ్రి గోవిందరాజులు జ్ఞాపకార్థం హాట్ వాటర్ మిషన్‌ను వితరణ చేశారు. బుధవారం డాక్టర్ అభినయ్, డాక్టర్ రమ్య, డాక్టర్ ప్రభుతేజ్, గ్రామ నాయకులు అల్లు ఈశ్వరరావు సమక్షంలో ఈ యంత్రాన్ని ప్రారంభించారు. వేడినీరు లేకపోవడంతో బయటకు వెళ్లి తెచ్చేందుకు రోగులు ఇబ్బందులకు గురయ్యేవారు. అటువంటి సమస్య లేకుండా 24 గంటలు వేడి నీరు అందుబాటులో ఉండేందుకు సహకరించిన శ్రీధర్‌ను పలువురు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో 573 మార్కులు సాధించిన విద్యార్థి గురిబిల్లి లావణ్యను ఎఐఎం సంస్థ ప్రతినిధులు మీసాల ప్రఫుల్ కుమార్, ఇప్పలి జానకి రామయ్య ఆధ్వర్యాన బుధవారం సన్మానించారు. అనంతరం మెరుగైన విద్యనందిస్తున్న ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కరరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘు పాత్రుని శివకుమార్, వైస్ ప్రిన్సిపల్ బాబురావు, పిఆర్‌టియు మండల అధ్యక్షులు బి.ప్రసాదరావు, ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బగ్గందొరవలస, తామరకండి గ్రామాల్లో బుధవారం పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. తాగునీరు, వీధిదీపాలు వంటి సమస్యలు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణే లక్ష్యం

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి, ఎఎస్‌పిలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో సంపూర్ణంగా మాదకద్రవ్యాలను నియంత్రించి, యువతను వ్యసనాల బారి నుంచి రక్షించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా ఎస్‌బిఐ బ్రాంచ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని తెలిపారు. అందుకే దేశభవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు. ప్రతి ఏటా జూన్ 26న మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువతను చెడు మార్గం వైపు నడిపించే మాదకద్రవ్యాలు అమ్మకాలు లేదా వినియోగించిన వారి గురించి సమాచారం ఇచ్చి డ్రగ్స్ నివారణలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మాదకద్రవ్యాలు అమ్మకాలు, వినియోగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, సిఐ కృష్ణారావు, ఎస్ఐ బి.రవీంద్ర రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం : ఖైని, గుట్కా వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు. ఎల్విన్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మేలుకో, భవితను మలచుకో, డ్రగ్స్‌ను వదులుకో, డ్రగ్స్ రహితం సమాజం.. సంక్షేమానికి సంకేతం.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుతం చాలామంది యువత వ్యసనాలకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బావి భారత పౌరులుగా ఎదగవలసిన విద్యార్థులు, యువత చెడు వ్యసనాలతో కన్నవారింట విషాదం నింపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు బిడ్డిక శివప్రసాద్, షణ్ముఖరావు, నీలకంఠారావు, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : యువత భవిష్యత్తు బాగుండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చినమేరంగి సిఐ మంగరాజు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సవరపు రమణ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధంపై కళాశాల నుంచి మార్కెట్ కూడలి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యువత జీవితంలో అలాంటి పరిస్థితి రానీయకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రానా, సురేష్, నగేష్, తేజ, పోలీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : డ్రగ్స్ రహిత సమాజంపై సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు ఎం.జగదీష్ నాయుడు, డి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితోపాటు సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన ర్యాలీ చేపట్టారు. సీతంపేటలో పార్కు నుండి సంత వరకు ర్యాలీ సాగింది. ఎస్ఐ జగదీష్‌నాయుడు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగించే వారి గురించి పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కురుపాం : మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని ఎస్ఇబి సిఐ జోగమ్మ అన్నారు. కురుపాం మోడల్ స్కూల్లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మోడల్ స్కూల్ నుంచి మెయిన్ రోడ్డు వరకు మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, పాఠశాల సిబ్బంది, ఎస్ఇబి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరమని, డ్రగ్స్ రహిత సమాజమే సంక్షేమానికి సంకేతమని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. పాచిపెంటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ ప్రభావంలో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

సీతానగరం : మాదకద్రవ్యాల వినియోగం ప్రమాదకరమని ఎస్ఐ రాజేష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు : యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందని టౌన్ సిఐ విహెచ్.వాసునాయుడు చెప్పారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, హెరాయిన్, మద్యం లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ముందు విద్యార్థులతో కలిసి పట్టణం లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషశ్రీ, ఎక్సైజ్ అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గరుగుబిల్లి మండల కేంద్రంలో ఎస్ఐ అమ్మన్నరావు అధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

పాచిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే జగదీశ్వరి

అధ్వానంగా తయారైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన కానసింగి గిరిజన గ్రామ రహదారిని ఆమె పరిశీలించారు. మూలి గూడ ప్రధాన రహదారి నుంచి కానసింగి గ్రామానికి 900 మీటర్లు పొడవు ఉన్న రహదారి నిర్మాణానికి రూ.80 లక్షలు ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు భద్రగిరి ఇంజనీరింగ్ డిఇ సింహాచలం తెలిపారు. సాధ్యమైనంత త్వరగా రోడ్డు పనులు ప్రారంభించి ప్రజల రాకపోకలకు వీలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుమూల కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణాలు చేపట్టి గిరిజనుల డోలి కష్టాలు తీర్చుతామని హామీనిచ్చారు. ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు మెరుగుపడేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు వెంపటాపు భారతి, బిజెపి నాయకులు నిమ్మక సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌టిల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1284 మంది సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని కోరుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి బుధవారం వారు వినతి పత్రం అందించారు. త్వరలో రానున్న 2024 డిఎస్‌సిలో తమను మినహాయించాలని కోరారు. సిఆర్‌టిలను రెగ్యులర్ చేసే వరకు డిఎ, హెచ్ఆర్ఎ వర్తింపచేయాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధితో

ప్రజల రుణం తీర్చుకుంటా

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

కారుపైనుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్, సీతానగరం,బలిజిపేట

పార్వతీ పురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఘన విజయాన్ని అందించిన ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా బుధవారం నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. భారీ కార్ల ర్యాలీతో విజయనగరం సమీపంలోని బైపాస్ రోడ్డు వద్దకు చేరుకుని స్వాగతం పలికారు. అక్కడ నుంచి కార్ల ర్యాలీతో తోడ్కొని వచ్చారు. సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద భారీ బైక్ ర్యాలీతో మరింత మంది నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్వతీపురంలోని పాత బస్టాండ్‌కు వచ్చే వరకు ఎక్కడికక్కడ ఆయనకు జనం హారతులిచ్చి, స్వాగతించారు. విజయచంద్ర కారుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పాత బస్టాండ్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే ప్రజలు అత్యంత ప్రేమాభిమానాలు చూపించి ఎన్నడూ లేనంతగా మెజార్టీతో గెలిపించారని తెలిపారు. తన సేవలతో ఐదేళ్లపాటు ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం బలిజిపేటలోని కళింగవైశ్య కల్యాణ మండపంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీతానగరం మండల అధ్యక్షులు పెంట సత్యం నాయుడు, సోము వెంకటరమణ, పెంకి వేణుగోపాల్ నాయుడు, రౌతు వేణుగోపాల్ నాయుడు, టి.వెంకటప్ప నాయుడు, కె.రామకృష్ణ, ఎస్.హరి గోపాలరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం.. సమస్యల పరిష్కార వేదిక

ఎమ్మెల్యే జగదీశ్వరి



సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి సభ్యులు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

పంచాయతీల అభివృద్ధి, ప్రజా సంక్షేమం మొదలైన అంశాలపై ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రజాప్రతినిధులు కలిసి నిర్వహించేదే సర్వసభ్య సమావేశమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఇందులో పార్టీలకతీతంగా ప్రజా సమస్యలను చర్చకు తీసుకువచ్చే వేదికగా సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొంగు సురేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశాన్ని వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు బాయ్‌కాట్ చేసి, అర్ధాంతరంగా వెళ్లిపోవడం సరికాదని అన్నారు. ఆ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చకు రావాలన్నారు. అనంతరం ఎంపిపి బొంగు సురేష్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా మండలంలోని ప్రభుత్వ అధికారుల పనితీరు బాగోలేదని, మార్చుకోకుంటే తీవ్ర పరిణామం ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అల్లువాడలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల అధ్యక్షులు పళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

వైసిపి సభ్యుల బాయ్‌కాట్

మండల సర్వసభ్య సమావేశాన్ని వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు బాయ్‌కాట్ చేశారు. ఎంపిపి బొంగు సురేష్ అధికారుల పట్ల దురుసుగా మాట్లాడుతూ, చిరుద్యోగులపై వేటు వేస్తామని బెదిరింపులకు పాల్పడడాన్ని తామంతా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వాహనాలను రద్దు చేస్తున్నట్లు మొన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన ప్రకటనను వ్యతిరేకించారు.

భీమవరపు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భీమవరపు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని ములగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎఎంసి మాజీ చైర్మన్ భీమవరపు కృష్ణమూర్తి కుటుంబాన్ని బుధవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి పరామర్శించారు. భీమవరపు కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జయమణి, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మి రమేష్, కొండపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాలవలసలో యాంటి లార్వా స్ప్రే

ప్రజాశక్తి -భామిని

కుళాయి వద్ద యాంటీ లార్వా ద్రావణాన్ని స్ప్రే చేస్తున్న కార్మికుడు

మండలంలోని పాలవలస గ్రామంలో బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో యాంటీ లార్వా స్ప్రే చేశారు. దోమలు పెరుగుదలను అరికట్టే అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని మందులను అందజేశారు. తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, పాలవలస సర్పంచ్ ప్రతినిధి బిడ్డికి తమ్మారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
SOP 1/2024

Between :
1. పతివాడ శ్రీనివాసరావు
2. మహదేవి మంగమ్మ
3. పతివాడ గణపతిరావు
4. పతివాడ శ్రీనివాసరావు
5. తాడ్డి పద్మజ ....పిటిషనర్లు

And
1. The Superintendent RMS BG Division Berhampur, (GM) Dept. of posts.
2. The HRO, RMS BG Division, Dept. of Posts, Rayagada.
3. SRO RMS B.G. Division, Berhampur, Odisha State.
4. The Post Master General, RMS BG Division, Berhampur, Odisha State.
5. The Postal Superintendent Head Post Office, Parvathipuram. ....రెస్పాండెంట్లు

బహిరంగ నోటీసు

ఇందలి పిటిషనర్ల పిన తండ్రి అయిన పతివాడ సూర్యనారాయణ గతంలో రెస్పాండెంట్ల డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన తరువాత పార్వతీపురంలో సుమారు రెండు సంవత్సరాలు పాటు పిటీషనర్ల ఇంటి వద్దనే ఉండి తదుపరి అతని మానసిక పరిస్థితి బాగులేనందున ఎవ్వరికి తెలియకుండా ఇల్లు విడిచి సుమారు ఎనిమిది సంవత్సరములు క్రితమే ఎక్కడికో వెళ్లిపోయినందున ఇప్పటివరకు అతని జాడ తెలియలేదు.

అతనికి రెస్పాండెంట్ల నుండి రావలసిన బకాయిలు మొత్తం రాబట్టుకొనుటకు అతడు అవివాహితుడైనందున ఇందలి పిటీషనర్లు అతనికి రెండవ తరగతి వారసులుగా డిక్లేర్ చేయమని పై నెంబరు గల సక్సెషన్ పిటిషన్ దాఖలు చేయగా **తే :05-08-2024 దీ**ని వాయిదా అయి ఉన్నది. ఈ విషయమై ఎల్లరకు తెలియజేయునది ఏమనగా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో పైన ఉదాహరించిన తేదీ నాడు సదరు కోర్టులో **ఉదయం గం॥ 10:30 ని॥ల**కు హాజరై తెలియపరచుకొనువచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

టి.జోగారావు, M.Com., LLB.,
అడ్వకేట్
ఎస్.ఎన్.పి.కోలనీ, పార్వతీపురం,
సెల్ నెం : 9441037309